# మాసిక

మెట్లు ఎక్కి మొదటి అంతస్తు చివరి వరకు వచ్చి 'ఎల్.పురుషోత్తం, సీనియర్ బ్రాంచి మేనేజర్' అని ఉన్న గది ముందు అర నిమిషం పాటు నిలబడ్డాను. ఆయన గదిలో మీటింగు ఏదయినా జరుగుతుంటే తలుపు తెరిచి లోపలికి వెళ్లడం బావుండదు. తలుపు పక్కగా బయటి గోడకు ఆనుకుని స్టూలు ఉంది. వసారాలో ఎవరూ లేరు. తలుపు మీద చిన్నగా తట్టాను. కుర్చీ కదిలిన చప్పుడు మటుకు వినిపించింది. మీటింగు జరుగుతున్నట్టు అనిపించలేదు. తలుపు కొద్దిగా తెరిచి చూశాను. ఆయన కూర్చుని ఉన్నాడు. బల్లమీద ఫైళ్లు ఉన్నాయి. ఆయన చేతుల్లో ఒక ఫైలు ఉంది. ఆయన చూపులు దానిమీద లేవు. సగం తెరచి ఉన్న కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు. కిటికీ వరకు వచ్చిన చెట్టు కొమ్మల్లోంచి పల్చటి ఎండ పడుతోంది. సమయం రెండు కావస్తోంది.

పదహారు సంవత్సరాల తర్వాత ఆయన్ని చూస్తున్నాను. మనిషి చాలా మారిపోయాడు. తలమీది జుట్టు చాలా భాగం తెల్లబడిపోయింది. సన్నబడ్డాడు. ఆయనకు యాభయి అయిదు సంవత్సరాలు దాటి ఉంటాయి. నాన్న ఈడువాడు. గదిలోకి నడిచి బల్ల ఎదురుగా నిలబడ్డాను. ఆయన నావంక చూడలేదు. కుడిచేయి నా వయిపుకు చాపి, "తెచ్చావా?" అడిగాడు. నేను రావడం విని ఉంటాడు. బహుశా నన్ను వాళ్ల బంట్రోతునని అనుకుని ఉండాలి. నేనేం మాట్లాడకపోయేసరికి నా వయపుకు తిరిగి నా ముఖంలోకి చూస్తూ, "సారీ మా బంట్రోతు అనుకున్నాను. అతన్ని సిగరెట్లు తీసుకురమ్మని అన్నాడు. ఆయన నన్ను గుర్తు పట్టలేదు. నాన్న బతికి ఉంటే ఈ స్థానంలో ఉండేవాడనుకుంటాను. నాన్న, ఆయన ఒకే సంవత్సరంలో ఉద్యోగాలలో చేరారు.

కుర్చీ బల్లకు దగ్గరగా జరుపుకుంటూ, "ఏం కావాలి?" అడిగాడు.

"నమస్తే అంకుల్... నేను మీ ఒకప్పటి స్నేహితుడు ప్రభాకర్ గారి అబ్బాయిని" అని రెండు క్షణాలు వెనకాడి, జేబులోంచి సిగరెట్ పెట్టె తీసి ఆయనకు ఇస్తోంటే వద్దనలేదు. తీసుకుని సిగరెట్ వెలిగించుకున్నాడు. అప్పట్లో కూడా సిగరెట్లు తెగ తాగేవాడు. సిగరెట్ పెట్టె తిరిగి నాకు ఇచ్చేస్తూ నా ముఖంలోకి పరీక్షగా రెండు క్షణాలు చూసి తల అడ్డంగా ఆడిస్తూ నా పక్కనే ఉన్న కుర్చీ చూపించి, కూర్చోమన్నట్టు సంజ్ఞ చేశాడు. కూర్చున్నాను నాన్న గుర్తు వచ్చినట్టు లేదు. మనిషి నెమ్మదస్తుడు. ప్రతిదీ ఆలస్యంగా చేస్తుండేవాడు. ఇప్పుడూ అంతే అనుకుంటాను.

"ఈ సిగరెట్లు ఇక్కడ దొరకవు. తాగుతున్నట్టే ఉండదు.... లోనుకు అప్లయి చేశావా?"

నవ్వి, "లేదంకుల్, మీరు నన్ను గుర్తు పట్టినట్టు లేదు. మానాన్నగారు మీతో కలిసి గాంధీనగర్ బ్రాంచిలో పనిచేశారు. ఆయన పేరు ప్రభాకర్. చనిపోయి పదహారు సంవత్సరాలు దాటాయి. మేం విద్యానగర్‌లో ఉండేవాళ్లం. మీరు అప్పుడప్పుడు మా ఇంటికి వస్తుండేవాళ్లు..." అన్నాను.

అప్పటికి గాని నాన్న గుర్తు రాలేదనుకుంటాను, తలూపుతూ నవ్వాడు. కుర్చీలోంచి లేచి కుడిచేయి ముందుకు చాపితే నా కుడి చేయి అందించాను. "ఎంత కాలమయింది...? అప్పట్లో సన్నగా ఉండేవాడివి... నీ పేరు.... నీ పేరు..." గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తోంటే, "ప్రసన్న చిత్ అండీ" ఇంట్లో బాబ్జీ అని పిలిచేవాళ్లు" అన్నాను. ఆయన కూర్చున్నాక నేనూ కూర్చున్నాను.

"వెంటనే గుర్తు రానందుకు ఏమనుకోకు వయసు. తన్నుకుంటూ వచ్చేస్తోంది... ఊ, చెప్పు. ప్రస్తుతం ఏంచేస్తున్నావు, ఎక్కడ ఉంటున్నావు?"

నాకు పన్నెండేళ్ల వయసులో నాన్న చనిపోయాడు. అమ్మ ఫొటో కూడా నా దగ్గర లేదు. నేను ముమ్మూర్తులా అమ్మలా ఉంటానని చాలామంది అంటూ ఉండడం నాకు ఇప్పటికీ గుర్తు. అమ్మను చూసి పదహారేళ్లు దాటాయి. అద్దంలో నన్ను నేను చూసుకున్నప్పుడల్లా అమ్మ గుర్తు వస్తుంటుంది. ఇప్పుడు ఎలా ఉందో? నేను ఇంట్లోంచి పారిపోయే నాటికి నాకు మూడేళ్లు. నా చదువు హైస్కూలుతోనే ఆగిపోయింది.

బంట్రోతు వచ్చి సిగరెట్ పెట్టె ఆయన బల్లమీద పెడుతోంటే, "శౌరీ, మా ఇద్దరికీ చక్కటి కాఫీ తెచ్చి పెట్టగలవూ?" అని నా వంక చూసి, "నువ్వు కాఫీ తాగుతావా, టీ తాగుతావా?" అడిగాడు.

"టీకి అలవాటుపడ్డాను కాని కాఫీ అంటే ఇష్టం"

"కాఫీ చెప్పు" అన్నాడు శౌరితో. శౌరి వెళ్లిపోయాక, "మీ నాన్న బతికి ఉండగా మీ వాడికి ప్రసన్న చిత్ అని పేరెందుకు పెట్టావు అని అడిగితే మావాడు ప్రసన్న చిత్తుడు. వాడు పుట్టాకే నాకు కలిసి వచ్చింది అన్నాడు. టయిఫాయిడ్ బారిన పడ్డాడు. తేరుకోలేకపోయాడు...ప్చ్..నువ్వు ఏం చేస్తున్నావో చెప్పలేదు" అన్నాడు.

"నేను ముంబయిలో ఉంటున్నాను. హోటల్ వ్యాపారంలో ఉన్నాను" అన్నాను.

అప్పట్లో ఆయనకింకా పెళ్ళికాలేదు.

"మీరు అప్పుడు చిక్కడపల్లిలో ఉండేవారు" అన్నాను.

"ఇప్పుడూ అక్కడే ఉంటున్నాను."

"మీకు ఎంతమంది పిల్లలు?"

తల అడ్డంగా ఆడించి, "లేరు, పెళ్ళిచేసుకోలేదు" అన్నాడు.

అప్పట్లో ఆయనకు తలకు మించిన బాధ్యతలు ఉండేవి. ఒకరూ ఇద్దరు కాదు. అయిదుగురు చెల్లెళ్ళు. ఆయన ఇంటికి పెద్ద. తండ్రి ఉన్నా ఏ ఉద్యోగం చేసేవాడు కాదు. తనకు పట్టనట్టు ఉండేవాడు. చెల్లెళ్ళను చదివించి పెళ్లి పెటాకులు చూడడంలో తన సంగతి మర్చిపోయి ఉండాలి.

శౌరి తెచ్చిన కాఫీ తాగుతోంటే, "నీకెంత మంది పిల్లలు" అడిగాడు.

"నేనింకా పెళ్ళి చేసుకోలేదండీ."

కాఫీ తాగి ఖాళీకప్పు బల్లమీద పెడుతోంటే, "నీకు సిగరెట్ తాగాలని ఉంటే మొహమాట పడకు. నేనేమీ అనుకోను. తాగు." అన్నాడు.

మామూలప్పుడయితే ఆయన ముందు సిగరెట్ ముట్టించి ఉండేవాడిని కాదు. నేను వచ్చిన పని ఏ మాత్రం ముందుకు జరగడం లేదు. మనసులో కలత ఎక్కువవుతోంటే ఉదయం నుండి ఇప్పటివరకు రెండు పెట్టెలు కాల్చాను. ఆయనకు సిగరెట్ ఆఫర్ చేసి పెట్టె ఆయన బల్లమీదే పెట్టి నేనొకటి తీసి వెలిగించాను. ఆయన ముందు నా మనసు తేలికయింది. ఆయన ద్వారా నేను వచ్చిన పని నెరవేరుతుందనే చిన్న ఆశ ఉంది.

"మీతో ఒక పని బడింది."

"చెప్పు."

"మీరు బిజీగా ఉన్నారా?"

"లేను"

"ఇన్ని సంవత్సరాల తర్వాత ఈ ఉదయం ఫ్లయిటులో ఇక్కడకు వచ్చి బేగంపేటలో ఓ హోటల్లో దిగాను. టిఫిన్ చేశాక టాక్సీ మాట్లాడుకుని మునుపు మేం ఉన్న ఇంటికి వెళ్ళాను. అక్కడ ఇళ్లన్నీ పడగొట్టి పెద్ద కాంప్లెక్సు కట్టారు. కాంప్లెక్సు సెక్రటరీని కలిసి అమ్మ పేరు, వివరాలు చెప్పి ఎక్కడ ఉంటున్నదో చెప్పమని అడిగాను. ఆ కాంప్లెక్సులో అమ్మ ఉండడం లేదు. కట్టిని దగ్గరనుండి అందులో లేదు. సెక్రటరీ నా ముందే బిల్డర్‌కు ఫోను చేశాడు. అతనూ ఏం చెప్పలేకపోయాడు.

"పదిన్నర తర్వాత లోగడ అమ్మ పనిచేసిన ఆఫీసుకు వెళ్ళి సరాసరి హెడ్‌నే కలిసి కనుక్కుంటే అతనూ ఏం చెప్పలేకపోయాడు. అప్పట్లో అమ్మతో పనిచేసిన వాళ్ళు ఎవరూ లేరు. బదిలీలయి అటూ, ఇటూ వెళ్ళిపోయారు. ఒక బంట్రోతు మటుకు అమ్మ చాలా సంవత్సరాల కిందటే ఉద్యోగం మానివేసిందని చెప్పాడు. కాని ఎక్కడ ఉంటున్నారో తనకు తెలియదన్నాడు. నాకు కొద్దో గొప్పో పరిచయం ఉన్న ఇద్దరు ముగ్గురిని అడిగాను. ఎవరికీ ఏమీ తెలియదు. మీరు మా కుటుంబం గురించి తెలిసినవారు. అమ్మా వాళ్ళు ఎక్కడ ఉంటున్నారో మీకు తెలుసా?"

ఆయన దీర్ఘంగా నిట్టూర్చి. "ఒక్క మాట చెప్పు, ఇన్ని సంవత్సరాలు నువ్వు ఇక్కడకు ఎందుకు రాలేదు?" అడిగాడు.

నా కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. ఆ ప్రశ్నకు నా దగ్గర జవాబులేదు. చేతిరుమాలుతో కన్నీళ్లు తుడుచుకుని కొద్దిసేపు మవునంగా ఉండి, "రాలేకపోయాను" అన్నాను. ఎందుకనో ఈ విషయం గుండెలోంచి బయటకు తీయాలనిపించలేదు. తెలుసుకుని ఎవరూ ఏమీ చేసేది ఉండదు.

"కోపమా?" అడిగాడు.

"నాకు ఎవరి మీద కోపం లేదు" జీవితంలో నేను ఏం కోల్పోయానో నాకు తెలుసు. బాధ ఒంటరి పురుగు. మనసును మనకు తెలియకుండానే డొల్ల చేస్తుంది.

"భోజనం చేశావా?"

"చేయలేదు."

"చేసేసిరా, దగ్గరలోనే మంచి హోటలుంది. ఈ మధ్యలో నేను ప్రయత్నం చేసి మీ అమ్మా వాళ్లు ఎక్కడ ఉంటున్నారో కనుక్కుంటాను, వర్రీ కాకు."

"చాలాసార్లు టీ తాగాను. ఆకలి చచ్చిపోయింది."

"బిస్కెట్లు ఉన్నాయి" బల్ల సొరుగు లోంచి తీయబోయాడు.

"వద్దండీ."

"పోనీ ఇంకో కాఫీ తెప్పిస్తాను" అని నా జవాబుకయి ఎదురు చూడకుండా బెల్ నొక్కాడు. శౌరి రాగానే "రెండు కాఫీలు తెచ్చి పెట్టమ్మా... నువ్వొక పని చేయి. బాగా అలిసిపోయినట్లున్నావు. అదో ఆ సోఫాలో కూర్చుని రిలాక్సుకా, ఫీల్ ఎట్ హోం. నాకు ఆఫీసే ఇల్లు. మా ఇంట్లో పరాయి వాడిలా ఫీలవుతుంటాను" అని శౌరి వెళ్ళిపోగానే "మీ అమ్మ గారి పేరు మర్చిపోయాను..." అన్నాడు.

"కాంతం, లక్ష్మీకాంతం" అని లేచి గది మూలలో ఉన్న సోఫాలో కూర్చున్నాను.

కాఫీ తాగి కళ్ళు మూసుకున్నాను. ఆయన ఫోనులో ఎవరెవరితోనో మాట్లాడడం నాకు వినిపిస్తూనే ఉంది. నలభయి నిమిషాలు ప్రయత్నం చేశాక అమ్మావాళ్ళు ఎక్కడ ఉంటున్నారో తెలుసుకోగలిగాడు. చిరునామా చెప్పిన వాళ్ళకు సంతోషంతో థేంక్స్ చెబుతోంటే కళ్ళు తెరిచి లేచి ఆయన బల్ల దగ్గరకు వచ్చాను. కాయితం మీద చిరునామా రాసి నాకు ఇస్తూ "ఫోను నెంబరు దొరకలేదు" అని తన విజిటింగ్ కార్డు ఇచ్చి "అమ్మ గారిని అడిగినట్టు చెప్పు. వీలుంటే అక్కడినుండి ఫోను చేయి" అన్నాడు.

"మీకు చాలా శ్రమ ఇచ్చాను. మీరు పూనుకుని ఉండకపోతే ఈ పని అయ్యేదికాదు." అని చేతులు జోడించి నమస్కరించాను.

"ఇక్కడ ఎన్ని రోజులుంటావు?"

"ఈ ఒక్కరోజుకే వచ్చాను. రాత్రి ఫ్లయిటులో తిరిగి వెళ్ళిపోతాను" అని మరొకసారి ఆయనకు కృతజ్ఞతలు చెప్పి మెట్లు దిగి కిందకు వచ్చాను. మనసు తేలికయి ఆనందంగా ఉంది. ఇంకో అరగంటలోనో, ముప్పావుగంటలోనో అమ్మను చూడబోతున్నాను. ఇన్ని సంవత్సరాల తర్వాత కలుస్తున్నందుకు నన్ను తిడుతుంది. నా చెంపలు వాయిస్తూ ఏడుస్తుంది. కారు కదిలింది. ఎక్కడికి వెళ్లాలో డ్రయివరుకు చెప్పాను.

అప్పట్లో నాకు అమ్మ మీద కన్నా సూర్యారావు మీద కోపం ఎక్కువగా ఉండేది. అతను అమ్మ కంటే నాలుగయిదు ఏళ్ళు చిన్నవాడని తనే నాతో ఒకసారి అంది. ఎక్కడ ఉద్యోగం చేసే వాడో నాకు తెలియదు. అమ్మను ఎప్పుడూ అడగలేదు. నాన్న చనిపోయిన రెండో సంవత్సరంలో అతనితో ఎలా పరిచయం అయిందో, ఏమో మొదట్లో పదిరోజులకో రెండు వారాలకొకసారో వచ్చేవాడు. తర్వాత్తర్వాత రోజూ మా ఇంటికి రావడం మొదలెట్టాడు. అతను రావడం నాకు ఏ మాత్రం ఇష్టం

ఉండేది కాదు. అతనితో మాట్లాడబుద్ధి అయ్యేది కాదు. అతను మా ఇంటికి రాగానే నేను ఇంట్లోంచి బయటకు వెళ్ళిపోయేవాడిని.

అమ్మ అతనికి దగ్గరయ్యేకొద్దీ నేను దూరం కాసాగాను. ఆమె ప్రేమకు క్రమక్రమంగా దూరమవుతున్నట్టనిపించి ఎంతో బాధగా ఉండేది. నేను అనుభవించిన నరకాన్ని ఎవరితో చెప్పుకోవాలో కూడా తెలిసేది కాదు. లైబ్రరీ మెట్లమీద ఒంటరిగా కూర్చుని కుళ్ళి కుళ్ళి ఏడ్చిన రోజులు ఉన్నాయి. ఒక సాయంత్రం భోజనం చేస్తుంటే అమ్మ నా ఎదురుగా కూర్చుని అంది, "నువ్వేమీ అనుకోనంటే నీతో ఒక మాట చెబుతాను..." అని రెండు క్షణాలు ఆగి, "రిజిస్ట్రార్ ఆఫీసులో నన్ను సూర్యారావు పెళ్ళి చేసుకుందామని అనుకుంటున్నాడు" అంది. అతి సామాన్యమయిన విషయం చెబుతున్నట్లుగా అనిపించింది. ఎప్పుడు అని నాకు అడగాలని అనిపించలేదు. అన్ని ప్రయత్నాలూ చేసుకున్నట్టుగా ఉంది. భోజనం చేస్తూనే కొద్దిసేపు అమ్మ ముఖంలోకి చూస్తూ ఉండిపోయాను. ఆమెకు నాకు ఇంకా ఏమో చెప్పాలనిపిస్తుందని అనిపించింది. చెప్పలేకపోతుంది. తన జీవితంలోంచి నన్ను తీసి పక్కన పెట్టింది. ఆమెకు ఏ విషయంలోనూ అడ్డు తగలదల్చుకోలేదు.

పదిరోజుల తర్వాత రిజిస్ట్రార్ ఆఫీసులో వాళ్ళకు పెళ్ళి అయిందని విన్నాను. పెళ్ళికి నన్ను తీసుకు వెళ్ళలేదు. ఆ సాయంత్రం హోటల్లో రిసెప్షన్ కూడా జరిగిందని నాకా మరుసటి రోజుకు కాని తెలియరాలేదు. నాకు తెలియకుండా జరిగిపోయినందుకు నాకు ఏమీ అనిపించలేదు. ఆ ఇంట్లో పుట్టి అమ్మ ఒడిలో ఆడుతూ పాడుతూ పెరిగిన నేను పరాయి వాడినయిపోయాను.

పెళ్లి అయ్యాక ఇంటి పెత్తనమంతా అతని స్వాధీనమయింది. అమ్మ దగ్గర నాకు చనువు తగ్గిపోయింది. ఏ విషయంలోనూ అమ్మ అతని మాట కాదనేది కాదు. నాకు ఏం కావాలన్నా అమ్మనే అడిగేవాడిని. ఆమెలో నామీద ప్రేమ కన్నా జాలే ఎక్కువగా కనిపించేది. అతను నన్ను ఏమనేవాడు కాదు. రోజుల తరబడి మేం మాట్లాడుకున్న సమయాలు లేవు. నాద్వారా ఏం కావాలన్నా అమ్మ ద్వారా చెప్పించి నాచేత చేయించేవాడు. అతను పని నేను ఎందుచేతనయినా చేయలేకపోతే, మర్చిపోతే, సమయానికి జరగకపోతే మొదట్లో అమ్మ చేత తిట్టించేవాడు. తర్వాత కొట్టించేవాడు. ఆయన బూట్లకు నేను పాలిష్ చేయాలి. గుడ్డలు ఇస్త్రీ నేనే చేయాలి. ఏ అర్థరాత్రప్పుడో అతనికి సిగరెట్లు కావలసి వస్తే అమ్మకు చెప్పి నన్ను పంపించేవాడు. రాత్రి పది

దాటాక సిగరెట్ బంకులు ఉండవు. ఏ సినిమాహాలు దగ్గరకో స్టేషనుకో వెళ్ళాల్సి వచ్చేది. చాలాదూరం నడవాల్సి వచ్చేది. నేను వెళ్ళిరావడం ఏ మాత్రం ఆలస్యమయినా అమ్మ మీద విరుచుకుపడేవాడు.

చాలా బాధలు సహించగలిగాను కాని ఒక్క విషయంలో మటుకు "వీలుకాదు" అని అమ్మతో తెగేసి చెప్పాను. అమ్మ అతన్ని "నాన్నా" అనమనేది. అనకపోయినా నష్టంలేదు. ఆ వత్తిడి ఎక్కడినుండి వస్తుందో నాకు తెలుసు. విధిలేక అతనితో మాట్లాడవలసి వస్తే "ఏమండీ" అని సంబోధించేవాడిని. మా ఇద్దరినీ దగ్గరకు తీసుకు రావడానికి అమ్మ చాలా ప్రయత్నించింది. అమ్మ ప్రయత్నించే కొద్దీ నాలో మొండితనం ఎక్కువ కావడం మొదలయింది. అతన్ని నాన్నా అని పిలవనందుకు ఒకరోజు కోపం పట్టలేక చీపురు తీసుకుని నన్ను తన ఇష్టం వచ్చినట్టు కొడుతోంటే అమ్మకాళ్ల మీద పడి ఏడుస్తూ, "అమ్మా నాన్నను నేను మర్చిపోలేదమ్మా. నన్ను కొట్టొద్దమ్మా. నేనిక్కడ ఉండడం మీకు ఇష్టం లేకపోతే నేనింట్లోంచి వెళ్లిపోతానమ్మా" అన్నాక నన్ను కొట్టడం ఆపి చీపురు అవతల పడేసి నా పక్కనే కూర్చుని అక్కున నన్ను చేర్చుకుని తనూ ఏడుస్తూ "వెళ్లొద్దురా బాబ్జీ. ఈసారి నిన్ను కొడితే అప్పుడను...నన్ను క్షమించరా... నువ్వు లేకపోతే నేను బతకలేనురా... ఇప్పటికొక శిక్ష అనుభవిస్తున్నాను. మరోటి వద్దురా భరించలేనురా... నువ్వెక్కడికీ వెళ్ళకురా బాబ్జీ..." అంది.

ఆ సాయంత్రం ఇంట్లోంచి పారిపోయి బొంబాయి వెళ్ళే బండి ఎక్కాను. అక్కడకు చేరుకున్నాక రెండు సంవత్సరాల పాటు హోటల్‌లో పనిచేస్తూ హోటలు ప్రొప్రయిటర్‌కు దగ్గరయి అతను నామీద ఉంచిన నమ్మకం మెట్లు ఒక్కొక్కటి... మెల్లగా ఎక్కుతూ పయికి వచ్చాను. ఇప్పుడు నా చేతుల్లో రెండు హోటళ్లు ఉన్నాయి.

దారి మధ్యలో టాక్సీ ఆపించి మంచి బేకరీలో పెద్ద కేక్ కొని దానిమీద జన్మదిన శుభాకాంక్షలు-బాబ్జి అని రాయించి మంచిగా పేక్ చేయించి, పక్కనే ఉన్న పూల షాపులోంచి పెద్ద బొకే తీసుకున్నాను. మరో అరగంటకు సిటీ బస్టాపు పక్కగా టాక్సీ ఆపించి దిగాను. బస్టాపుకు ఇవతల ఉన్న ఇస్త్రీ కొట్టువాడిని అడిగాను. "అదొ, ఎదురుగా కనబడుతున్న ఇల్లే సూర్యారావుగారిదె" అన్నాడు. అని వెంటనే "వస్తోంది ఆయనే" అన్నాడు.

అతన్ని చూడగానే నాగుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. అతను పెద్దగా ఏం మారలేదు. మనిషి కొద్దిగా లావెక్కాడు. పొట్ట వచ్చింది. ముందు జుట్టు కొద్దిగా ఊడి నుదురు పెద్దగా ఉంది. చెంపల మీది జుట్టు తెల్లబడింది. అతని

చేయి పట్టుకుని పన్నెండేళ్ల కుర్రాడు అతనితో నడుస్తున్నాడు. ఇంటి తలుపుకు తాళం వేస్తున్న ఆమె వంక చూశాను. పక్కనే ప్లాస్టిక్ బుట్ట ఉంది. నా కాళ్లు భూమికి అతుక్కుపోయినట్టుగా ఉన్నాయి. క్షణక్షణం అధికమవుతున్న ఉద్వేగం అణుచుకోలేకపోతున్నాను. అతను నేను నిలబడిన చోటుకే వచ్చాడు. నేనతన్ని దగ్గరగా చూశాను. అతను నా వంక చూశాడు. నన్ను గుర్తు పట్టినట్టు లేదు. అమ్మ కూడా నన్ను వెంటనే గుర్తు పట్టలేదా?

ఆమె తలుపుకు తాళం వేసి వెనక్కి తిరిగింది. క్షణం పాటు నాగుండె కొట్టుకోవడం మానేసింది. ఊపిరి తీసుకోవడం కూడా మర్చిపోయాను. ఆమె నా అమ్మకాదు. ఆమెకు ముప్పయి అయిదు సంవత్సరాల పయినే ఉండొచ్చు. ఎర్రగా, లావుగా ఉంది. ముఖం కోపంతో చిటపట లాడుతోంది. వచ్చి సూర్యారావు పక్కనే నిలబడి తన చేతిలోని సంచి కుర్రాడికిస్తూ “ఈ సంచి ఎవరు పట్టుకుంటార్రా మీ బాబా?” అరుస్తున్నట్టుగా అంది. గొంతు బొంగురుగా ఉంది. లేత చేతులతో వాడు సంచి పట్టుకున్నప్పుడు చూశాను. వాడి ముఖంలో అమ్మ పోలికలు స్పష్టంగా కనబడుతున్నాయి. చిన్నప్పుడు నేను వాడిలా ఉండేవాడిననుకుంటాను.

“ఏం, ఆ కాంతం ముండ దగ్గరకు వెళ్తేనేం, వెళ్ళకపోతేనేం? నిన్ను గుర్తుపట్టి చస్తుందా ఏమిటి?” అంది దీర్ఘాలు తీస్తూ.

“ఇవేళ దాని పుట్టిన రోజే. ఈ రోజయినా వెళ్లి చూడకపోతే ఎలా? ” అని వస్తున్న ఆటో ఆపి, “ఎర్రగడ్డ పిచ్చాసుపత్రికి తీసుకెళ్ళు” అంటూ ఆటో ఎక్కబోతున్నాడు. నేను చూస్తూనే ఉన్నాను. కుర్రవాడు ఏం చేయలేదు. నోరుకూడా మెదపలేదు. లాగి వాడి చెంపమీద గట్టిగా కొట్టింది. “ఏమయిందే సరస్వతీ? వాడినెందుకు అలా చంపుకు తింటుంటావు?” అడిగి సూర్యారావు ఆ కుర్రాడిని దగ్గరకు తీసుకున్నాడు.

ఆమె జవాబు చెప్పలేదు. వాడు చెంప తడుముకుంటున్నాడు కాని ఏడవలేదు. ఆమె వంక అసహ్యంగా చూసి ఆటో ఎక్కాడు. ఆమె చేత దెబ్బలు తినీ తిని అలవాటు పడి ఉండాలి.

“వేలెడంత లేదు. వాడికెందుకంత మొండిపట్టు నన్ను అమ్మా అని పిలవరా అంటే ఎందుకు పిలవడు?” అంది సరస్వతి.

❖